హైదరాబాద్ వార్త





# ఆ ఫుడ్ ..మంచిదేనా..?

-నగరంలో పెరుగుతున్న క్లౌడ్‌కిచెన్ కల్చర్
-లైసెన్స్ లేకుండా ఇళ్లు, మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు
-ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ల స్వీకరణ..
ఆహార శుభ్రతపై అనుమానాలు
-ఇటీవల ఫుడ్‌సేఫ్టీ దాడుల్లో బయటపడ్డ నిజాలు

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** నగరంలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు పెరిగిన కొద్దీ.. క్లౌడ్ కిచెన్ల సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది. రెస్టారెంట్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. మొబైల్‌లో ఒక్క క్లిక్‌తో ఆహారం ఇంటికే వస్తుండటంతో వేలాది మంది వీటిపై ఆధారపడుతున్నారు. అయితే.. ఆఫుడ్ ఎక్కడ తయారవుతోంది..? ఎలాంటి పరిస్థితుల్లో వండుతున్నారు..? పరిశుభ్రత ఉందా లేదా..?అనే విషయాలు మాత్రం చాలా మందికి తెలియవు. తాజాగా హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో క్లౌడ్ కిచెన్లలో భారీ ఉల్లంఘనలు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోంది. ఎక్స్‌పైరీ ఫుడ్, అపరిశుభ్ర కిచెన్లు, లైసెన్స్‌లు లేకపోవడం, పిల్లులు, ఈగలు, పురుగుల మధ్య వంటలు ఇలా షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. కొందరు గృహిణులు ఇంటి నుంచే పరిమిత స్థాయిలో హోమ్ ఫుడ్ అందిస్తుండగా.. మరికొందరు ఉద్యోగులు అదనపు ఆదాయం కోసం చిన్న స్థాయిలో క్లౌడ్ కిచెన్లు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు భారీ స్థాయిలో రోజుకు వేలాది ఫుడ్ ఆర్డర్లను సిద్ధం చేసే కమర్షియల్ క్లౌడ్ కిచెన్లు కూడా ఉన్నాయి. భారీగా ఐటీ ఉద్యోగులు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, బ్యాచిలర్లు, కుటుంబాలు రోజువారీగా ఈ క్లౌడ్ కిచెన్ల నుంచే ఫుడ్ ఆర్డర్ చేస్తున్నారు.

**ఫుడ్‌సేఫ్టీ తనిఖీల్లో అసలు బాగోతం..**

అయితే బయట కనిపించే బ్రాండ్ పేరు వెనుక ఉన్న అసలు కిచెన్ ఎలా ఉందో.. ఎక్కడ ఉందో.. వినియోగదారులకు తెలిసే అవకాశం చాలా తక్కువగా ఉంటోంది. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్ ఎస్టాబ్లిషెడ్ క్లౌడ్ కిచెన్ల అసలు పరిస్థితి బయటపడింది. గడువు ముగిసిన లైసెన్స్‌లతోనే కొన్ని కిచెన్లు కొనసాగుతుండగా.. మరికొన్ని ఎలాంటి లైసెన్స్‌లు లేకుండానే నడుస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ ఐటమ్స్, సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయని చికెన్, మటన్, ఫ్రోజన్ పదార్థాలు, లేబులింగ్ లేకుండా నిల్వ చేసిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రమైన ఫ్రిజ్‌లు, మురికిగా ఉన్న వంటగదులు, చేతులు కడుక్కునే సదుపాయం లేకపోవడం, చెత్త మధ్యే వంటలు చేయడం వంటి అనేక ఉల్లంఘనలు వెలుగుచూశాయి. కొన్ని చోట్ల పిల్లులు, ఈగలు, బొద్దింకలు, ఎలుకల ఆనవాళ్లు కూడా అధికారులు గుర్తించారు. ఆహారం వండే వ్యక్తులు గ్లౌజులు, హెయిర్ క్యాప్స్, ఏప్రాన్‌లు లేకుండా వంట చేయడం, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకపోవడం, స్టోరేజ్ నిబంధనలు పాటించకపోవడం, ముడి ఆహారం, వండిన ఆహారాన్ని ఒకే చోట ఉంచడం వంటి తీవ్రమైన లోపాలు కూడా బయటపడ్డాయి. చాలాచోట్ల ఫైర్ సేఫ్టీ, వ్యర్థాల నిర్వహణ, పురుగుల నివారణ చర్యలు కూడా లేకపోవడం అధికారులు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పూర్తిగా విస్మరించి వ్యాపారం నిర్వహిస్తున్న క్లౌడ్ కిచెన్లపై నోటీసులు జారీ చేయడంతో పాటు.. కొన్ని చోట్ల లైసెన్స్ సస్పెన్షన్ చర్యలు కూడా చేపట్టారు.

**ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేటప్పుడు జాగ్రత్త..**

హైజీన్, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని వారిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. జీహెచ్‌ఎంసి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మూర్తి రాజు హెచ్చరించారు. ఆన్ లైన్ లో ఫుడ్ ఆర్డర్ చేసే ముందు వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని లైసెన్స్ వివరాలు, రేటింగ్స్, వినియోగదారుల రివ్యూలు పరిశీలించాలని.. అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. తక్కువ ధరలు, ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి ఆర్డర్ చేయడం కంటే.. నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. నగరవాసుల ఆరోగ్యంతో రాజీపడే క్లౌడ్ కిచెన్లపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని.. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# హైడ్రాకు రెండేళ్లు..

-ఓవైపు హర్షాతిరేకాలు..
మరోవైపు ఆరోపణలు
-ఇప్పటివరకు 3315 ఎకరాల భూమికి రక్షణ
-వాటివిలువ సుమారు 1.5లక్షల కోట్లు

**హైదరాబాద్, జులై 18,ప్రభాతవార్త:** ప్రభుత్వ భూముల రక్షణే ప్రధాన ఎజెండాగా ఏర్పాటు చేఇసన హైడ్రాకు నేటితో రెండేళ్లు నిండనున్నాయి. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడి మాకాలనీలకు జీవం పోశారని కొన్ని కాలనీల్లో వేడుకలు చేసుకోగా.. చెరువులను పునరుద్ధరించి అక్కడ ఆహ్లాదకర వాతావరణం ఉండేలా హైడ్రా చర్యలు తీసుకుందని మరి కొన్ని ప్రాంతాల వారు సంబరాలు చేసుకున్నారు. కొండలు గుట్టలతో పచ్చని వాతావరణం ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా చర్యలు తీసుకున్నారంటూ మరి కొంతమంది వేడుక చేసుకున్నారు. హైడ్రా ఫెన్సింగ్ వేసి కాపాడిన ప్రభుత్వ భూముల్లో టపాసులు పేల్చి కేరింతలు కొటారు. ఇలా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్, నెక్లెస్ రోడ్డుకు చేరుకుని భారీ ర్యాలీ తీశారు. ఎన్‌టీఆర్ గార్డెన్ నుంచి లుంబినీ పార్కు వరకూ భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రాను ఏర్పాటు చేసి నగరానికి భవిష్యత్తునిచ్చిన రేవంత్‌రెడ్డి నిలువెత్తు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా దేశానికే ఆదర్శమంటూ పలువురు కితాబునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాను విస్తరించి జిల్లాల్లో కూడా చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. రెండేళ్లలో 3315 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రాను అభినందించారు. ఈ భూముల విలువ లెక్కల్లో చూస్తే రూ. 1.50 లక్షల కోట్లు అయినా.. ప్రాణవాయువును అందించే పార్కుల రూపంలో.. భూగర్భ జలాలను పెంపొందించి.. వరదల కట్టడి చేసిన చెరువుల విభాగంలో చూస్తే విలువ అనంతమంటూ కీర్తించారు. హైడ్రా ఏర్పాటు చేయడం ప్రభుత్వ సాహసోపేత నిర్ణయంగా పలువురు అభివర్ణించారు. అనంతరం సచివాలయంలో వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.




హైడ్రాకు అనుకూలంగా నెక్లెస్‌రోడ్‌లో ర్యాలీ తీస్తున్న నగరంలోని వివిధ కాలనీల ప్రజలు

# నేడే ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఘటోత్సవం..

-భక్తుల చెంతకు అమ్మవారి ఘటం
-ఆగస్టు 2న బోనాలు,3న భవిష్యవాణి (రంగం)

**బేగంపేట జులై 18,ప్రభాతవార్త** చారిత్రక శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ మాస బోనాల జాతరకు నేడు అంకురార్పణ జరగనుంది.శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరను ప్రధానంగా మూడు ఘట్టాలుగా నిర్వహిస్తారు.మొదట ఘటోత్సవం (అమ్మ వారి ఎదుర్కోలు)తో ప్రారంభం అవుతాయి.15 రోజు బోనాల వేడుకలు జరుగుతాయి.ఆ తర్వాత రోజు రంగం (భవిష్యవాణి) కార్యక్రమం, అంబారీ ఊరేగింపు ఉంటాయి.19న ప్రారంభమైన ఘటోత్సవం 31వ తేదీ వరకు వివిధ ప్రాంతాలకు చేరుకుని భక్తులతో పూజలు అందుకుంటుంది. అమ్మ వారి ఘటము ఆయా ప్రాంతాలకు వచ్చినపుడు ఆ ప్రాంతం లో ఉన్న గ్రామ దేవత ఆలయంలో దింపడం జరుగుతుంది. భక్తులు అంతా అక్కడికే వచ్చి తమ మొక్కుబడులు ఒడి బియ్యం,పసుపు,కుంకుమలు సమర్పించాలని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ,కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.ఘటోత్సవం రోజు మధ్యాహ్నం అమ్మ వారి ఆభరణాలు, ఘటం తయారీకి ఉపయోగించే కర్రలు,పసుపు,కుంకుమ,పూజా సామాగ్రికి ఆలయంలో మంత్రులు,ఆలయ ఈ ఓ,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.అనంతరం ఆలయం నుంచి పొలిమేరగా భావించే కర్బలా మైదానం వద్దకు తీసికెళ్తారు.ఆ సామాగ్రిని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు.వారు ఘటాన్ని రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.డప్పు చప్పుళ్ళ,వేలాది మంది భక్తులతో ఘటం భారీ ఊరేగింపుగా బయలు దేరుతుంది.అమ్మ వారే ఘటం రూపంలో తమ ముందుకు వస్తుందని భక్తుల విశ్వాసం.ఆషాడ మాసం అంతా అమ్మ వారికి సాక, బోనాలు సమర్పించవచ్చని ,అమ్మ వారిని దర్శించుకోవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.ఈ సందర్భంగా ఆలయంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.



అమ్మ వారి ఘటం (ఫైల్‌ఫోటో)

**ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో ఘటం.....**

19న అమ్మ వారి ఘటం మధ్యాహ్నం గం 2లకు ఆలయం నుంచి బయలు దేరి కర్బలా మైదానంలోని శ్రీ అమ్మ వారి ఆలయం వద్ద ఘటం అలంకరణ పూర్తి చేసుకుని రాత్రి గం 10లకు దేవాలయానికి చేరుకుంటుంది.20వ తేదీ సోమవారం హిమంబావి,డొక్కులమ్మ దేవాలయం,21న కళాసీగూడా,22న నల్లగుట్ట,23న పాన్ బజార్,24 న ఓల్డ్‌బోయిగూడా,25న రంగ్రేజీ బజార్,26న చిలకలగూడా,27న ఉప్పరబస్తీ,28న కుమ్మరిగూడా,29న రెజిమెంటల్ బజార్,30న ఘటం ఏ వీధిలోకి వెళ్లకుండా ఆలయంలోనే ఉంటుంది.31న బోయిగూడా ప్రాంతానికి ఉదయం గం 10లకు దేవాలయం నుంచి బయలు దేరి 1శనివారం రాత్రి గం 7లకు దేవాలయానికి చేరుకుంటుంది.

# కేబీఆర్ ఉద్యానవనంలో భారీ కొండచిలువ

**జూబ్లీహిల్స్, జూలై 18, ప్రభాతవార్తః** బంజారాహిల్స్‌లోని కేబీఆర్ జాతీయ ఉద్యానవనంలో శనివారం ఉదయం భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. ఉదయం 7 గంటల ప్రాంతంలో దాదాపు పది అడుగులకు పైగా ఉన్న కొండచిలువ ప్రత్యక్షమవ్వడంతో నడకదారులు అది గమనించి ఆందోళనకు గురవ్వడమే కాకుండా కంగారుపడ్డారు. కేబీఆర్ ఉద్యానవనంలో దాదాపు నాలుగున్నర కిలోమీటర్ల మేర నడకదారి ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కలిపి దాదాపు వేయిమందికిపైగా నడకకు వస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం నడకదారిలో ఒక భారీ కొండ చిలువ దారిని దాటుతూ కనిపించింది. దీంతో అటువైపుగా వచ్చిన నడకదారులు వెంటనే ఆగిపోయారు. తన సెల్‌ఫోన్లలో ఆయా భారీ కొండ చిలువను బంధించారు. కొందరు నడకదారులు భయాందోళనకు గురయ్యారు. మరోపక్క కొండ చిలువ కడుపులో ఎదో ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. దీంతో ఉద్యానవనంలోని ఏదైనా జంతువును, పక్షిని తిని ఉంటుందని నడకదారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే కొండచిలువ నెమ్మదిగా కదులుతూ రోడ్డును దాటిందని చెబుతున్నారు. ఈ విషయాన్ని నడకదారులు తమ సెల్‌ఫోన్లలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. పార్కులోకి వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని కొందరు సందేశం పెడితే జంతువులు, పక్షులు ఉన్న ప్రాంతంలోకి మనమే వెళ్లాం, అది వాటి ప్రాంతం అంటూ మరికొందరు సందేశాలు పెట్టారు. తొలిసారిగా కేబీఆర్ ఉద్యానవనంలో ఇంత పెద్ద కొండచిలువ కనిపించడం ఇదే మొదటి సారి కావడం గమనార్హం. గతంలో ఈ ఉద్యానం లోపల, బయట ఆరడుగుల మేర ఉన్న పాములు అనేకమార్లు కనిపించాయి. అయితే స్నేక్ సొసైటీ సభ్యులు వాటిని పట్టుకొని వెళ్లేవారు. భారీ కొండ చిలువ ఉన్న నేపథ్యంలో మిగిలిన పక్షుల, జంతువుల భద్రతతోపాటు నడకదారుల భద్రతపై అటవీ అధికారులు దృష్టి సారించాలని నడకదారులు కోరుతున్నారు.



కేబీఆర్ ఉద్యానవనంలో నడకదారి దాటుతున్న భారీ కొండచిలువ

# సర్కిల్ కార్యాలయంలో అధికారుల ఇష్టారాజ్యం..

-అదుపుతప్పిన అధికారుల అవినీతి.. పడకేసిన పాలన -సిఎంసి అధికారులకు అమ్యామ్యాలు ఇవ్వాలంటూ వసూళ్ళు

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జులై18 ప్రభాతవార్త:** సీఎంసి ఆల్వీన్‌కాలనీ 51 సర్కిల్ కార్యాలయం అవినీతి, అక్రమ వసూళ్ళకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. డిప్యూటీ కమిషనర్ ఇష్టారాజ్యం, పర్యవేక్షణ లోపంతో రెవిన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో కొందరు అధికారులు అవినీతి, అక్రమ వసూళ్ళు తారా స్థాయికి చేరింది.లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఇక్కడ పోస్టు దక్కించుకున్న కొందరు అధికారులు తన కింది స్థాయి అధికారులు, సిబ్బంది బ్రోకర్లతో వసూళ్ళ దందాకు దిగుతున్నట్లు ఆరో పణలు పెద్దఎత్తున వస్తున్నాయి. ఈ కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వ హిస్తోన్న అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో , ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు తమ ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నప్పటికీ సీఎంసి కమిషనర్ పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కార్యాలయాన్ని తమ స్వంత ఎస్టేట్‌లా భావిస్తూ చిత్తం వచ్చినప్పుడు కార్యాలయానికి వస్తూ, పోతుండడతో ఆయా పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.ఎప్పుడు చూసినా తనిఖీలు, సమావేశాల పేరుతో కార్యాలయంలో అందుబాటులో ఉండని ప్రజలు పేర్కొంటున్నారు. సర్కిల్ కార్యాలయంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతి, అక్రమ వసూళ్ళపై అటు ఏసీబీ గాని ఇటు విజిలెన్స్ విభాగం దృష్టిసారించకపోవడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**అద్వాన్నపు పారిశుద్యంతో ప్రజలు అవస్థలు..**

డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలోపంతో ఆల్వీన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో అద్వాన్నపు పారిశుద్యంతో పజలు అనేక అవస్థలు పడుతున్నారు. శానిటేషన్ అధికారులు జేబులు నింపుకోవడానికే పరిమితమై, పారిశుద్య సమస్యలను పట్టించుకోకపోవడంతో బస్తీలు, కాలనీల్లో చెత్తా,చెదారాలు పేరుకుపోయి అసహ్యంగా తయారువవతున్నాయి. పారిశుద్య గ్రూపుల్లో చేయాల్సిన వారికంటే తక్కువ మంది పనిచేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పారిశుద్యం మెరుగుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారు. పారిశుద్యం పనుల నిర్వహణ కోసం కోట్లాదిరూపాయల్ని వెచ్చిస్తున్నప్పటికీ కొందరు అధికారులు ఈ పనుల నిర్వహణలో వారి నిర్లక్ష్యం ప్రజల పాలిట పెనుశాపంగా మారింది. నెలవారీ మామూళ్ళకే పరిమితమైన ఘనాపాటీ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో శానిటేషన్ విభాగంలో అక్రమాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి.

**అవినీతిమయంగా ఇంజనీరింగ్ విభాగం..**

ఆల్వీన్‌కాలనీ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అవినీతి, అక్రమ వసూళ్ళకు నిలయంగా మారింది. పర్సెంటీజీలకు అలవాటుపడిన కొంత మంది అధికారుల నిర్వాకం మూలంగా పనుల్లో నాణ్యత లోపిస్తుంది. పనులు మంజూరు చేసే సమయంలోనే పర్సెంటేజీలను నిర్ణయిస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని కొందరు అధికారుల అవినీతి చర్యలకు అడ్డుకట్టపడడంలేదు. ఇదిలా ఉండగా కొందరు అధికారులకు ముడుపులు ఇస్తేనే పైళ్ళు ముందుకు కదులుతు న్నాయి. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న అధికారులు ఇంజనీరింగ్ నియమ నిబంధనల్ని అమలు చేయకపోవడం వల్ల సీఎంసికీ రూ.కోట్ల రూపా యల నష్టం వస్తోంది. ఆధునిక రోడ్ల నిర్మాణం అవినీతి పునాదుల్లో కూరుకు పోయింది. అభివృద్ధి పనుల్లో నాణ్యతా తుంగలో తొక్కడం గుత్తేదార్లకు పారిపాటిగా మారింది.



సర్కిల్ కార్యాలయం

**రెవిన్యూ అధికారుల అవినీతి లీలలు..**
**అసెస్‌మెంట్లలో రూ.కోట్ల గోల్‌మాల్..**

ఆల్వీన్‌కాలనీ సర్కిల్‌లో వెలుస్తున్న అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ భవనాలు కొందరు రెవిన్యూ అధికారులకు కాసులుకురిపిస్తున్నాయి. స్వీయ మదింపులో కొందరు అధికారులు, ట్యాక్స్ ఇన్స్‌పెక్టర్లు, బిల్‌కలెక్టర్లు జిమ్మిక్కులతో గోల్‌మాల్ చేస్తూ రూ.కోట్లలో సిఎంసి ఆదాయానికి గండికొడుతూ జేబులు నింపుకుంటున్నారు. స్వీయ మదింపులో అవకతవకలు, అక్రమాలు యధేచ్ఛగా కొనసాగుతున్నా సీఎంసి ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. ఇంటి ఓనర్లతో స్వీయ మదింపు వల్ల ఎక్కువ పన్ను పడుతుందని మామూళ్ళ ఇస్తే అతి తక్కువ పన్ను విధిస్తామని ఇంటి యజమానులకు చెప్పి అందినంత దండుకుంటున్న రెవిన్యూ అధికారులు, టిఐల అవినీతికి అడ్డుకట్ట వేసే నాధుడే కరువయ్యాడు. ఇదిలా ఉండగా రోజుల తరబడి స్వీయ మదింపు దరఖాస్తులు ఆమోదానికి నోచుకోకపోవడతో కొందరు యజమానులు రెవిన్యూ అధికారులు, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లకు బిల్‌కలెక్టర్లు నియమించుకున్న వ్యక్తులు, బ్రోకర్ల ను ఆశ్రయిస్తేను రెవిన్యూ విభాగంలో పనులు అవుతున్నాయి. ఓ వైపు భవన యజమానులతోపాటు మరో వైపు రెవిన్యూ విభాగం అధికారులు, టిఐలు, బిల్‌కలెక్టర్లు కుమ్మక్కవడంతో సీఎంసి రూ.కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోతుంది.

**జోన్ కమిషనర్‌నే అడుగాలి : డీసీ చాముండేశ్వరి**

సర్కిల్ 51 ఆల్వీన్‌కాలనీ సర్కిల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు కొందరు ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతూ ముడుపులిస్తేనేపనులు చేస్తున్నారని, అదే విధంగా కొందరు అధికారులు, సిబ్బంది తమ విధులను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తూ సమయ పాలనపాటించపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరిని వివరణ కోరగా ఈ విషయంలో కూకట్‌పల్లి జోన్ కమిషనర్‌ని అడుగాలని ఆమె తెలిపారు.

# కన్నులపండువగా శృతి నృత్యోపాసన

**రవీంద్రభారతి, జూలై 18 ప్రభాతవార్త :** ప్రఖ్యాత నాట్యగురువు నిష్టల సుధామాల శిష్యురాలు శృతి వారణాసి కూచిపూడి నృత్యరూపకం నృత్యోపాసన విచ్చేసిన అశేష ప్రేక్షకులు, కళాప్రియులకు కన్నుల పండువ కావించింది. శనివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ నృత్యమాల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కాంతం వి.ఎస్. రవికుమార్‌ల తనయ నృత్యోపాసనను ముందుగా పుష్పాంజలి-గణపతిస్తుతి అంశంతో ప్రారంభించి కాంభోజరాగం మిశ్రచాపు తాళంలో ప్రహ్లాద పట్టాభిషేక శబ్దం; అదేనమ్మ హరుదు; భామాకలాపం-ప్రవేశ దరువు; కౌశల్యానందన రామ; తరంగం; శంకరాభరణ రాగం, మిశ్రచాపు తాళంలో పదం; చివరి అత్యంత అద్భుత అంశం రాగమాలిక రాగం ఆదితాళంలో సింహానందిని నేత్రపర్వంగా ప్రదర్శించి ప్రతిఒక్కరి హర్షద్దానాల మధ్య ప్రశంసలు అందుకుంది. డా. కె.ఉమావైజయంతిమాల, ఎన్.సుధామాల, బి. మాధవిమాలల కొరియోగ్రఫీ నట్టువాంగంలో మంథ శ్రీనివాస్ గాత్రం, ఎస్.నాగేశ్వరరావు మృదంగం, కె.అనిల్‌కుమార్ వయోలిన్, జె.దత్తాత్రేయులు వేణువులతో అద్భుత వాద్యస హకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ అతిథులు జి.వసుంధర, నాట్యగురువులు భాగవతుల సేతురామ్, కళాకృష్ణ, పి .శేషుబాబు, వనజ ఉదయ్ తదితరులు కళాకారిణి శృతి వారణాసిని ఘనంగా సత్కరించి, గురువు నిష్టల సుధామాలలను ఎంతగానో అభినందించారు.



శృతి నృత్యోపాసన కూచిపూడి నృత్యరూపకంలో ఒక దృశ్యం

## కౌమార బాలికల్లో ఆరోగ్యం, భద్రతపై అవగాహన

**జూబ్లీహిల్స్, జూలై 18, ప్రభాతవార్తః** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం కౌమార బాలికల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మన్మథరావు మాట్లాడుతూ కౌమార బాలికలు తమ ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత, హక్కులు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ, సీడీపీవో సునీత, డీసీపీఓ, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొని పలు కీలక అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. రుతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, మంచి స్పర్శ-చెడు స్పర్శ, సైబర్ భద్రత, పోషకాహారం, మహిళల అక్రమ రవాణా నివారణ వంటి అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఆర్, సాయిరామ్, గ్లోబల్, ఎస్‌ఎల్‌ఎన్, విజ్ఞాన్ జ్యోతి పాఠశాలలకు చెందిన 10వ తరగతి కౌమార బాలికలు పాల్గొన్నారు.

# బోరబండలో కానిస్టేబుల్‌పై కత్తి, సుత్తితో దాడి

- ప్రభుత్వ ట్యాబ్ ధ్వంసం

**జూబ్లీహిల్స్, జూలై 18, ప్రభాతవార్తః** బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీ సు కానిస్టేబుల్‌పై ఒక వ్యక్తి సుత్తి, కత్తితో దాడి చేసి ప్రభుత్వ ట్యాబ్‌ను ధ్వంసం చేసిన సంఘటన చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ పి. యజుర్వేద(పీసీ నెం. 3763) డయల్100కు వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం 6.45 గంటల సమయంలో ఎస్ఆర్‌టీ నగర్‌లోని హనుమాన్ ఆలయం సమీపానికి వెళ్లారు. ఇద్దరు సోదరుల మధ్య భూమి, డబ్బు వివాదానికి సంబంధించి గొడవ జరుగుతుండగా అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే మహ్మద్ షా ఫైసల్(45) ఆగ్రహానికి గురై తన సోదరుడి దుకాణంలోని పచ్చడి బాక్సులను ధ్వంసం చేశాడు. పోలీసులు అతన్ని బోరబండ పోలీస్ స్టేషన్‌కు తరలించేం దుకు ప్రయత్నించగా, సుత్తి, చిన్న కత్తితో కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. దీంతో కానిస్టేబుల్‌కు ముఖం, పక్కటెముకలకు గాయా లయ్యాయి. బహిరంగంగా అల్లరి సృష్టించడమే కాకుండా ప్రభుత్వానికి చెందిన ట్యాబ్‌ను ధ్వంసం చేశాడు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడినందుకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బిపి మెషిన్ దొంగిలించానంటు వీడియో పోస్ట్ ..యువకుడి అరెస్ట్**

**సికింద్రాబాద్, జూలై 18 ప్రభాతవార్త:** సోషల్ మీడియా వేదికగా కొందరు ట్రెండింగ్ కావాలనే పిచ్చి ఆకాంక్షతో ఏది పడితే అది చేసేస్తున్నారు. తాజాగా గాంధీ ఆస్పత్రిని కించపరిచే విధంగా రీల్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అదికాస్తా వైరల్ అయింది. పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన వరుణ్ అనే యువకుడి తాతా ఇటీవల అనారోగ్యానికి గురవడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అతనితో పాటు వచ్చిన వరుణ్ వ్యూస్ కోసం బీపీ కొలిచే మిషన్ పనిచేయడం లేదని, దాన్ని దొంగిలించి తీసుకువెళుతున్నట్లు నకిలీ చోరి రీల్ చేసి తన ఇన్స్‌టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. నిత్యం వేతధి మందికి ఉచితంగా అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న గాంధీ ఆస్పత్రి ప్రతిష్టను దెబ్బతీసేదిగా ఉండడంతో అస్పత్రి వర్గాలు చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## నేడు ఛలో అంబేద్కర్ స్టాచ్యూ పేరిట 'మాలల మహా ధర్నా'

**సైఫాబాద్, జులై 18 (ప్రభాతవార్త):** మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న 'చలో అంబేద్కర్‌స్టాచ్యూ' పేరట 'మాలల మహా ధర్నా' కార్యక్రమాన్ని ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద చేపడుతున్నామని జై భీమ్ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు అంబేద్కర్ విగ్రహం ఎదుట అసోసియేషన్ ఛైర్ పర్సన్, అధ్యక్షురాలు సుధమల అంజలి, వైస్-ప్రెసిడెంట్లు దాసరి విశాల్, కాదారం వినయ్‌కుమార్ తదితరులు ఈ ధర్నాకు సంబంధించిన కర పత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, గౌరవ అతిథిగా మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ (గ్రూప్-3లో ఉన్న మాల, ఇతర 25 కులాలను మొదటి రోస్టర్ పాయింట్లను 22 నుంచి16కు మార్చాలని, అలాగే మాల, 25 ఇతర కులాలకు 50 లోపు మూడు రోస్టర్ పాయింట్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాలో మాలలు, మాల ఉపకులాలకు చెందిన వారు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌ముదిరాజ్



టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితను కలిసిన ప్రవీణ్ ముదిరాజ్

**ముషీరాబాద్, జులై 18, (ప్రభాతవార్త):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంచి గారి ప్రవీణ్‌ముదిరాజ్ నియామకం అయ్యారు. ఈ మేరకు టీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమాలలో, తెలంగాణ ఉద్యమంలో అనేక పర్యాయాలు పాల్గొని జైలుకు వెళ్లిన తనను గుర్తించి, ఆనాడు తెలంగాణ జాగృతిలో హైదరాబాద్ నగర అధ్యక్షునిగా నియమించారని గుర్తు చేశారు. నేడు తన పనిని గుర్తించి, తెలంగాణ రక్షణ సేన యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇవ్వటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించటంలో సహకరించిన పార్టీ మిత్రులందరికీ ధన్యవాదములు తెలియచేస్తున్నాన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి : నవీన్ నికోలస్



ఎన్ఎస్‌పీసీ-2026 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నవీన్ నికోలస్

**హైదరాబాద్, జులై 18 (ప్రభాతవార్త) :** జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ (ఎన్ఎస్‌పీసీ-2026) పోస్టర్‌ను తెలంగాణ పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ శనివారం ఆవిష్కరించారు. జులై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పోటీ ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ బాధ్యత, సుస్థిర జీవన విధానాలు, మిషన్ లైఫ్ సూత్రాలపై అవగాహన పెంపొందుతుందని ఆయన తెలిపారు. గతంలో తెలంగాణ ఈ పోటీలో విశేష ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో, ఈ ఏడాది కూడా ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఎన్ఎస్‌పీసీ నోడల్ టీచర్‌గా నియమించి, "ఎన్ఎస్‌పీసీ దినోత్సవం" నిర్వహించడం ద్వారా విద్యార్థులందరూ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంచాలకులు, ఎన్ఎస్‌పీసీ-2026 జాతీయ సహసమన్వయకర్త డా. డబ్ల్యూ.జి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పాఠశాల విద్యా శాఖ అందిస్తున్న సహకారానికి పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ అధికారులు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేవి దేవాలయంలో వైభవంగా గుప్త నవరాత్రులు



యజ్ఞ పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్యాంకర్, అర్చకులు

**చాంద్రాయణగుట్ట, జులై 18, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని శ్రీ దేవి దేవాలయంలో మూడు రోజులుగా జరిగిన ఆషాఢ మాసం గుప్త (వారాహి) నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్యాంకర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ పూజా కార్యక్రమాలు అర్చకులు కపిల్ కార్యాంకర్, సౌరవ్ కార్యాంకర్లు నిర్వహించారు. భవానీ మాతకు ఐదు రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మహా హారతి ఇచ్చారు. అంతకుముందు ఉదయం యజ్ఞం, పూర్ణాహుతి చేపట్టారు. సమీప బస్తీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని, యజ్ఞ భగవానుని దర్శించుకొని పూజించారు. అర్చకులు విశాల్ కుమార్ కార్యాంకర్‌చే భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆ తరువాత స్వామివారికి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేష్ ముదిరాజ్, ఎ.మహేష్ గౌడ్, వి.జంగయ్య, బి.మాణిక్యరావు, డి.వజ్ర కుమార్, శేఖర్ గౌడ్, వి.వినోద్ కుమార్, మహేష్ యాదవ్, కె.జ్ఞానేశ్వర్, పాల్వాయి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నేతలు



యువసంగ్రామ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నేతలు మర్రిశ్రీకాంత్ తదితరులు

**కంటోన్మెంట్, జూలై 18 (ప్రభాతవార్త):** విద్యావంతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి,కంటోన్మెంట్ ఇన్‌ఛార్జ్ మన్నెక్రిశాంక్ ఆరోపించారు. కేటీఆర్ పిలుపు మేరకు శనివారం సరూర్ నగర్‌లో తలపెట్టిన యువ సంగ్రామ సభకు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు పికెట్ చౌరస్తా నుంచి భారీ ర్యాలీతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, అనితా ప్రభాకర్,నళిని కిరణ్, బీఆర్ఎస్ నేతలు పి.కిరణ్,పర్వీన్, పెంట శ్రీహరి, శేఖర్,బత్తుల నారాయణ,ఎస్.రాము పాల్గొన్నారు.

## కార్లకు నెల వారి అద్దె రూ.55 వేలకు పెంచాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

**సైఫాబాద్, జులై 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దెకు వినియోగిస్తున్న కార్లకు నెలవారిగా రెంట్‌ను 34 వేల నుంచి 55 వేలకు పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అలాగే ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీలోగా రెంట్ డబ్బులు కూడా ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 9 సంవత్సరాల క్రితం నిర్ణయించిన ధరలు ఇప్పటి కొనసాగడం దారుణమన్నారు. పెట్రోల్, డిజీల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, రెట్టింపు అయినాయని ఆయన చెప్పారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ హైర్ వెహికిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే డ్రైవర్లకు 70 వేల రూపాయలు నెలకు వేతనం చెల్లిస్తున్నదని, వాహనం నిర్వహణకు అదనంగా మరో 30 వేల రూపాయలు ఖర్చు అవుతున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రెంట్ 34 వేల రూపాయలు చెల్లించి, చేతులు దులుపుకోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అద్దె వాహనం దారుల విషయంలో వారి సమస్యలను నెల రోజుల్లో ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి, డిసిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం కొసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం గత మూడు రోజులుగా వాహనం దారులు సమ్మె చేస్తున్నారని, నేడు విరమించడం జరిగిందని, సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు మాసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆర్,కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సభలు బిసి నేతలు నీల వెంకటేష్, సి.రాజేందర్, అనంతయ్య, మహ్మద్ ఆలీ, అక్బర్, రాజు, షేక్ పిషా, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా పునరుద్ధరించాలి : మాజీ డిజిపి పూర్ణచంద్రరావు





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీజీపీ డాక్టర్ జే.పూర్ణచంద్ర రావు

**ముషీరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా పునరుద్ధరించాలని, దానికై క్రైస్తవ సమాజం ఏకమవ్వాలని మాజీ డీజీపీ జే.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఆంధ్ర నరకిస్టియన్ కో ఆర్డినేషన్ కౌన్సిల్(సీసీసీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. క్రైస్తవ సమాజంలో ఎదుర్కొంటున్న సమకాలీన సమస్యలు, రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రార్ధనా స్థలాలు సమాజ శ్రేయస్సు కోసం సంకల్పాలు చేసే పవిత్ర వేదికలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, క్రైస్తవులపై దాడుల నివారణ, మత మార్పిడి నిరోధక చట్టాల రద్దు కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. రాజకీయ అవగాహన లేకుండా సామాజిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని, అందువల్ల క్రైస్తవ యువత రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఓటు ప్రజల చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన రాజ్యాంగ ఆయుధమని, సమాజ ప్రయోజనాలను కాపాడే నాయకత్వాన్ని ఎన్నుకోవటానికి దానిని చైతన్యంతో వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంకు ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజి మాజీ ప్రిన్స్‌పాల్ జాన్ ప్రభాకర్ అధ్యక్షత వహించగా, ప్రిన్స్‌పాల్ వరకుమార్, మాజీ ఐపీఎస్ అధికారులు జి.ఆల్ఫ్రెడ్, కే.బాబూరావు, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త పరంజ్యోతి, బీసీ టైమన్స సంపాదకులు సంగెం సూర్యారావు, డేనియల్, అశోక్ కుమార్, ఇతర క్రైస్తవ నాయకులు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధం కావాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ , చిత్రంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి

**చిక్కడపల్లి జులై 18 ( ప్రభాతవార్త ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి, బొల్లంపల్లి రామిరెడ్డి, కలకోట అరుణ్ కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. భరత్ గౌడ్, పార్థసారథిర్భంగా జిల్లా రాజకీయ పరిస్థితులు, బూత్ స్థాయి బలోపేతం, సభ్యత్వ నమోదు, రానున్న సంస్థాగత కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్థసారథి మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

## 'సర్'లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలి : విహెచ్





'సర్' పత్రాలను పంపిణీ చేస్తున్న విహెచ్, చిత్రంలో సచిన్ సావత్, మోత రోహిత్, శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జులై 18 ప్రభాతవార్త :** 'సర్'లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. తమ ఇన్యూమరేషన్ ఫామ్‌ను నింపకపోతే తమ ఓటు కోల్పోతారని, ఓటు మన హక్కు అని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో సర్ హెల్ప్ డెస్క్‌ను ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్,ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్‌లతో కలిసి సర్ హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వెంటనే సరిచేయించుకోవాలని, కొత్తగా అర్హులైన వారు నమోదు చేసుకోవాలని కోరారు.ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని అన్నారు. ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోత రోహిత్ మాట్లాడుతూ అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో పేరు నమోదు కాకుండా మిగిలిపోకూడదని, యువత, మహిళలు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, బీఎల్‌ఓలకు అవసరమైన వివరాలు అందించి ప్రతి పౌరుడు బాధ్యతగా ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టిపిసిసి మాజీ జనరల్ సెక్రెటరీ ఆర్.లక్ష్మణ్‌యాదవ్,పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, బాగ్ అంబర్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ రావుల సుధాకర్, గడ్డం శ్రీధర్ గౌడ్, కుంకుమ రాజేశ్వర్, సి సుధాకర్, మహేష్ గౌడ, సతీష్, పుట్ట రాకేష్,సునీత రెడ్డి, లావణ్య, శాంత మ్మ, శ్రీదేవి, సోనీ,గడ్డం సునీల్, ఈ డెల్లి రాకేష్,రోహన్ గౌడ్ ,సందీప్ గౌడ్, మొయిస్ బాయ్ , సర్ఫరాజ్, ఫిరోజ్ భాయ్, సల్మీముల్ల,సైఫ్,పాల్గొన్నారు.

## మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది : డా.పరకాల ప్రభాకర్





సదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

**హైదరాబాద్ జులై 18 ప్రభాతవార్త :** ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, తలసరి ఆదాయం ఆఫ్రికా దేశాలకంటే వెనుకబడి ఉందని, దీనితోపాటు నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల భారీ పెరుగుదల సామాన్యుల నడ్డివిరుగుతుందని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డా. పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. 57వ బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, గన్‌ఫౌండ్రిలో శనివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్ల ప్రాధాన్యత' అనే అంశం పై సదస్సు ఫెడరేషన్ అధ్యక్షుడు బి. రవీంద్ర నాథ్ అధ్యక్షతన జరిగింది. తొలుత ఏఐబిఈఏ జాతీయ అధ్యక్షులు బి.ఎస్. రాంబాబు స్వాగతం పలుకగా డా. పరకాల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, నైపుణ్యాల కొరత, అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్మెంట్ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు సహా అన్ని రంగాల కార్మికులు పరస్పర సంఘీభావంతో పనిచేస్తేనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం అధికారిక లెక్కల కంటే ఎక్కువగా ఉందని, డీమానిటైజేషన్ అనంతరం ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రభావానికి గురైందని అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే వచ్చే 14 ఏళ్లలో అధిక ఆర్థిక వృద్ధితో పాటు భారీ స్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏడాది కనీసం 80 లక్షల నుంచి రెండు కోట్ల వరకు ఉద్యోగ అవకాశాలు సృష్టించే దిశగా కార్యాచరణ ఉండాలని సూచించారు.బ్యాంకుల జాతీయకరణ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు కార్మిక సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపిటిబిఈఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఉదయ్ భాస్కర్, సమద్ ఖాన్, జె. జానకిరామ్, అజయ్ కుమార్, మధుసూదన్, శైలేంద్ర, నల్లపు రెడ్డి, కుమార్, నాయక్, నిరంజన్, తేజేష్వి, నిహారిక, సుమలత, సుప్రియ, భార్గవి, పద్మ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

### సర్‌లో ఓటర్లు తమ పేర్లను నమోదు చేయించుకోవాలి



ఓటర్లకు గణన ఫారాలు అందజేస్తున్న సీనియర్ బిజెపి నాయకులు రమేష్ యాదవ్

**చార్మినార్, జులై 18 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియలో భాగంగా శనివారం సీనియర్ బిజెపి నాయకులు బి.రమేష్ యాదవ్ లాల్‌దర్వాజ ప్రాంతంలో గణన ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఓటర్లు బిఎల్ఓకు గణన ఫారాలు అందజేయాలని తెలిపారు. సర్‌లో ఓటర్లు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

## మొబైల్ ఫోన్ల వ్యసనం పిల్లలపై తీవ్ర ప్రభావం : ఆధ్యాత్మికవేత్త బాగేశ్వర్ సర్కార్





విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశంలో మాట్లాడుతున్న బాగేశ్వర్ ధామ్ బాలాజీ ఆలయ ప్రధాన పూజారి, ఆధ్యాత్మికవేత్త శ్రీ బాగేశ్వర్ సర్కార్

**హైదరాబాద్, జులై 18 ప్రభాతవార్త**

మొబైల్ ఫోన్ల వ్యసనం పిల్లలపై తీవ్ర ప్రభావాలను చూపుతుందని, దీని ప్రభావంతో విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచనా శక్తి తగ్గిపోతాయని బాగేశ్వర్ ధామ్ బాలాజీ ఆలయ ప్రధాన పూజారి, ఆధ్యాత్మిక నాయకుడు శ్రీ బాగేశ్వర్ సర్కార్ తెలిపారు. శనివారం గుండ్లపోచంపల్లి, డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో డిఆర్ఎస్ఐఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొని స్కూల్ ఆవరణలో జ్ఞాపక శిలా పలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.ప్రసంగిస్తూ విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశాలు వారిలో నైతిక విలువలు, మానసిక ప్రశాంతత మరియు ఏకాగ్రతను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. మొబైల్ ఫోన్లు, ఇంస్టాగ్రామ్, పేస్ బుక్‌లకు దూరంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని చెప్పారు. ప్రార్థన మరియు ధ్యానంతో ఒత్తిడి తగ్గి, చదువు, పరీక్షల భయం నుండి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. పిల్లలకు పార్కులకు తీసుకెళ్లడం, పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాలని కోరారు. రామాయణం, మహాభారతం, స్వామి వివేకానంద వంటి మహనీయుల జీవితాల నుండి నీతి కథలను పిల్లలకు టీచర్లు చెప్పాలన్నారు. తల్లితండ్రులను, పెద్దలను గౌరవించడం, తోటి విద్యార్థులకు సహాయపడటం, ప్రకృతిని ప్రేమించడం వంటి సద్గుణాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతను కేవలం పూజలకు పరిమితం చేయకుండా, దైనందిన జీవితంలో దాని ఆచరణాత్మక ప్రాముఖ్యతను అనుసరించాలని చెప్పారు. డిఆర్ఎస్ఐఎస్ డైరెక్టర్ గర్వ్ అగర్వాల్ స్వాగతపన్యాసం చేస్తూ విద్యార్థులలో శారీరక, మానసిక సమస్యలు మరియు ఒత్తిడిని తగ్గించడానికి విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమకాలీన విద్యతో పాటు ఆధ్యాత్మికతను జోడించడం ద్వారా విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఉన్నతమైన వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుకోగలుగుతారని చెప్పారు. ఈ సమావేశంలో సంస్థ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు సంజయ్ కుమార్ అగర్వాల్, అంజనీకుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఐ.వేణు గోపాల్‌తోపాటు వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

# జెహెచ్ఐసి పాలకమండలి సభ్యులపై కేసు నమోదు

**- నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలు, రికార్డులు తారుమారు**

**- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, జులై 18, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జెహెచ్ఐసీ) పాలక మండలి ఎన్నికల వ్యవహారంలో నకిలీ పత్రాలు, సంతకాల ఫోర్జరీ, అధికారిక రికార్డుల తారుమారుపై జేఎచ్ఐసీ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సురేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ప్రస్తుత పాలకమండలితోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సురేందర్ రెడ్డి సెప్టెంబర్ 2023 నుంచి సెప్టెంబర్ 2025 వరకు జేఎచ్ఐసీ అధ్యక్షుడిగా పనిచేశారు. గతేడాది అక్టోబర్ 16న ప్రస్తుత పాలక మండలి సభ్యులు సొసైటీల రిజిస్ట్రార్ కార్యాలయానికి పాలక మండలి మార్పులకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. ఈ వ్యవహారంలో అనుమానం రావడంతో సురేందర్ రెడ్డి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి సంబంధిత ధృవీకరణ ప్రతులను పొందారు. వాటిని పరిశీలించగా తన సంతకాలతో పాటు పలు కీలక పత్రాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. గతేడాది జూన్ 12న జరిగిన పాలక మండలి సమావేశం రికార్డుల్లో టి. నరేంద్ర చౌదరిని రిటర్నింగ్ అధికారిగా ఆమోదించినట్లు తప్పుడు వివరాలు చేర్చారు. ఆ సమావేశ మినిట్స్‌పై సురేందర్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. పాలక మండలి మార్పుపై ఎలాంటి వివాదం లేదని పేర్కొంటూ నో డిస్ప్యూట్ లెటర్ పేరుతో సురేందర్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. గతేడాది సెప్టెంబర్ 21న స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకున్నట్లు పేర్కొన్న మరో లేఖలో నకిలీ సంతకాలు చేశారు. దీనికితోడుజేఎచ్ఐసీ ఎన్నికల ప్రక్రియలో సస్పెండ్ లేదా తొలగించబడిన సభ్యులను ఓటర్ల జాబితాలో చేర్చడమే కాకుండా కొందరు అర్హులైన సభ్యులను బెదిరించి ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకున్నారు. చివరకు ఎలాంటి పోటీ లేకుండానే 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుత పాలక మండలి నకిలీ పత్రాల ఆధారంగా సుమారు రూ.75 లక్షలు న్యాయ వ్యయాల పేరుతో ఖర్చు చేసినట్లు అందులో పేర్కొన్నారు. సురేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ప్రస్తుత పాలకమండలికి చెందిన వసంత్‌కుమార్, ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి, జగ్గారావు, జనార్దన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులపై సెక్షన్లు 316(2), 318(4), 336(3), 340(2)తో పాటు 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

**- అఖిల భారతీయ రేకా మజ్దూర్ మహాసంఘ్**

**చిక్కడపల్లి జులై 18 ప్రభాతవార్త :** కార్మికులకు ఉద్యోగంలో ఉన్నప్పుడే కాకుండా, పదవీ విరమణ అనంతరం కూడా జీవితాంతం సామాజిక భద్రత కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అఖిల భారతీయ రేకా మజ్దూర్ మహాసంఘ్ ఇన్‌చార్జ్ కె.వి. రాధాకృష్ణన్ అన్నారు. శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బిఎంఎస్ కేంద్ర కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సామాజిక భద్రత పరిరక్షణలో లోపాలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐసీ సీలింగ్ పెంపుపై ప్రభుత్వం ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈఎస్ఐసీ పరిమితిని తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. గత 14 సంవత్సరాలుగా ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.1,000గానే కొనసాగించడం శోచనీయమన్నారు. పెన్షన్ పెంపు కోసం ఎదురుచూస్తున్న అనేక మంది కార్మికులు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తూనే కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెరగడంతో ఈపీఎఫ్ సీలింగ్ కారణంగా పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈపీఎఫ్ సీలింగ్‌ను ఎత్తివేసి రూ.42 వేల లోపు వేతనం పొందే ఉద్యోగులందరికీ 12 శాతం యజమాని, 12 శాతం ఉద్యోగి వాటాతో ఈపీఎఫ్ వర్తింపజేస్తే భవిష్యత్తులో మెరుగైన పెన్షన్ లభిస్తుందని అన్నారు. వృద్ధాప్యంలో పెన్షన్‌పై ఆధారపడుతున్న కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాధాకృష్ణన్ కోరారు.

## ఇంటర్నేషనల్ సెయిలింగ్ పోటీల్లో బిఎస్‌సి క్యాడెట్ల ప్రతిభ





పోటీల్లో గెలుపొందిన సెయిలర్లు

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** ఈ నెల 12 నుంచి 18 వరకు నిర్వహించిన 1వ ఇండియా ఇంటర్నేషనల్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌తో పాటు 40వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ విజయవంతంగా ముగిసింది. ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో త్రిష్ణా సెయిలింగ్ క్లబ్‌కు చెందిన బీఎస్సీ క్యాడెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఆర్మీ భాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ కి చెందిన సెయిలర్లు త్రిష్ణా సెయిలింగ్ క్లబ్ తరపున పోటీలోకి దిగారు. ఇల్కా-4 విభాగంలో క్యాడెట్ రాహుల్ సోనార్ రజత పతకాన్ని (సిల్వర్ మెడల్) కైవసం చేసుకోగా, ఇల్కా-6 అండర్19 విభాగంలో క్యాడెట్ హృతిక్ అమర్ స్వర్ణ పతకాన్ని (గోల్డ్ మెడల్) సాధించారు. ఈ విజయాల వెనుక కోచ్ నవీన్ కుమార్ శిక్షణ, మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు. క్యాడెట్ల విజయంపై క్లబ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

## యువతిపై లైంగిక దాడికి యత్నం

**..చెవి కమ్మలు దోచుకుని పరార్..**

**బేగంపేట జులై 18,ప్రభాతవార్త**

ఒంటరిగా ఉన్న యువతి పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి యత్నించడంతో పాటు చెవి కమ్మలు దోచుకుని పరారైన సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి.సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన యువతి (26) వ్యక్తి గత పనిమీద నాగోల్ ప్రాంతానికి వెళ్లింది. శనివారం తెల్లవారు ఝామున 3 గంటల ప్రాంతంలో నాగోల్ నుంచి ద్విచక్ర వాహన దారుడిని లిఫ్ట్ అడిగి ప్యాట్నీ సెంటర్‌కు చేరుకుంది.అక్కడ లిఫ్ట్ కోసం ఎదురు చూస్తున్న సమయంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు యువతిని బలవంతంగా సమీపంలోని ఓ ఖాళీ స్థలంలోకి లాక్కుని పోయారు. ఆమెపై లైంగిక దాడికి యత్నించడంతో బాధితురాలు గట్టిగా కేకలు వేసింది.దీంతో నిందితులు ఆమెను అక్కడ వదిలి చెవి కమ్మలను బలవంతంగా లాక్కుని అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు డయల్ 100కు కాల్ చేసింది.వెంటనే బేగంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాపార భాగస్వామిపై లైంగిక వేధింపులు

**జూబ్లీహిల్స్, జులై 18, ప్రభాతవార్తః** సహభాగస్వామిపై లైంగిక వేదింపులకు పాల్పడిన భాగస్వామిపై ఫిల్మ్‌నగర్ ఠాణాలో కేసు నమోదైంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. మేఘావి వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ సలేచా జైన్ తన సహ వ్యవస్థాపకురాలితో కొంత కాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఇలానే ఈ నెల 11న రోడ్ నెం.16లోని తన కార్యాలయంలో తనను లైంగిక సంబంధం కోసం వేధించడం, అసభ్యంగా మాట్లాడ టం, బెదిరింపులకు పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 75(3), 79, 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

**ముషీరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వృద్ధుడు (70) మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 16వ తేదీ దోమలగూడ పోలీస్ కానిస్టేబుల్ పెట్రోలింగ్‌లో ఉన్న సమయంలో గుర్తు తెలియని వృద్ధుడు పాత అంబేద్కర్ విగ్రహం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి, 108 సాయంతో వృద్ధుడిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించారు. వృద్ధుడిని పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు ధృవీకరించారు. వృద్ధుని గురించి విచారించగా ఎవరూ వివరాలు తెలపకపోవటంతో మృత దేహాన్ని గాంధీ హాస్పటల్ మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. వృద్ధునికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## చాంద్రాయణగుట్టలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో హెచ్-ఫాస్ట్ తనిఖీలు

**- రెండు కేంద్రాలు, ముగ్గురు వ్యక్తులపై కేసు**





హెచ్-ఫాస్ట్ అధికారులు తనిఖీ చేసిన అల్ మదీనా చైనీస్ ఫాస్ట్ సెంటర్

**చాంద్రాయణగుట్ట, జులై 18, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట చౌరస్తాలోని రెండు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలలో హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్) శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. వాటిలో కుళ్లిన చికెన్, కృత్రిమ రంగులు, వాడేసిన నూనెలు, ఫ్రైడ్ చికెన్ 40కెజిలు, రంగు పూసిన చికెన్ 40కెజిలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు... వివరాలలోకి వెళితే హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రజినీకాంత్ గౌడ్, ఎం.అంజయ్యల ఆధ్వర్యంలో ఎస్ఐ వి.శంకర్, ఫుడ్ సేఫ్టీ అధికారి ఆర్.దైవనిధి, బృందం చాంద్రాయణగుట్ట చౌరస్తాలోని అల్ మదీనా చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, ఓమర్ చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరియైన పరిశుభ్రత లేకపోవటం, నాణ్యతలేని కృత్రిమ రంగులు, వాడేసిన నూనెలు, కుళ్ళిన చికెన్, ఫ్రైడ్ చికెన్ 40కెజిలు, రంగులు పూసిన చికెన్ 40కెజిలు, నీటి విశ్లేషన సర్టిఫికెట్ లేకపోవటం వంటి పలు లోపాలను గుర్తించారు. రెండు కేంద్రాలపై, ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం స్వాధీనం చేసుకున్న వస్తువులను, వ్యక్తులను చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న ఒక రాజకీయ పార్టీ నేతలు, బాధితులతో కలిసి పోలీసుస్టేషన్ ముందు ఉన్నఫళంగా ధర్నా నిర్వహించారు. హెచ్-ఫాస్ట్ అధికారులను దూషించారు. పైగా పలు ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరిశుభ్రత, లైసెన్స్ లేని ఆహార కేంద్రాలలో ఆహారం తీసుకోవద్దని, ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసే ముందు ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్, తయారీ, గడుపు, తేదీలు, సరియైన లేబులింగ్‌ను సరి చూసుకోవాలని హెచ్-ఫాస్ట్ అధికారులు సూచించారు. ఆహార కల్తీ, అపరిశుభ్రమైన ఆహార పద్ధతుల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 87126 61212కు తెలియజేయాలని కోరారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, సూపర్వైజర్ నరేష్‌కు ఓటరు ఫారాలను అందజేస్తున్న ఓటర్లు

**మలక్ పేట, జూలై 18, ప్రభాతవార్త:**
ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్ పేట సూపర్వైజర్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్ పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం ఆస్మాన్ ఘాడ్ లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కేంద్రంలో పలువురు ఓటర్ల నుంచి ఓటరు ఫారాలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ నరేష్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటర్ లిస్ట్ లో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మలక్ పేట అస్మాన్ ఘాడ్ లో చురుకుగా జరుగుతోందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తమ పేరు తప్పనిసరిగా జాబితాలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. తమ పేర్లతో పాటు కుటుంబంలోని ప్రతి సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. ఆగస్టు 3వ తేదీ వరకు ఎస్ఐఆర్ కార్యక్రమం పొడిగించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేందర్,గౌస్,పలువురు బిఎల్వోలు పాల్గొన్నారు.

## మూసి నిర్వాసితులకు అండగా ఉంటాం : బిజెపి



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవిఎన్‌రెడ్డి

**సైదాబాద్, జులై 18 ప్రభాతవార్త:** మూసినది నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే రెండు పడకల ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో సైదాబాద్ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు బిజెపి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఏవిఎన్‌రెడ్డి, బిజెపి సీనియర్ సిటిజన్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చందర్జీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ బాధితులకు న్యాయం జరిగే వరకు బిజెపి వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం : సామ సుందర్‌రెడ్డి



యువ సంగ్రామ సదస్సుకు ర్యాలీగా తరలివెళ్తున్న సామ సుందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 18 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో యువత, నిరుద్యోగులు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్దాలు, బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చడం లేదన్నారు.కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరేణుకకవచ, హృదయ, ఖడ్గమాల పారాయణాలు



అమ్మవారికి పూజలు పాలెం మనోహరశర్మ, సోమ వెంకటమ్మ

**ఎల్.బి.నగర్, జూన్ 18 ప్రభాతవార్త:**
శ్రీరేణుకాదేవి(ఎల్లమ్మ), శ్రీవిజయదుర్గాదేవి సమేత అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీరేణుకకవచ, హృదయ, ఖడ్గమాల పారాయణాలు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పుష్కర బ్రహ్మోత్సవాలు శ్రీదేవి ఉపాసకురాలు, గురుమాత సోమ వెంకటమ్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. కొత్తపేట న్యూమారుతినగర్ రోడ్‌నెంబర్ 5లోని శ్రీరేణుకఎల్లమ్మ, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శ్రీవిద్యాగణపతిపూజ, స్థాపిత దేవార్చన, బల, అతిబల, మహాబల, కలశక్తి, జీవశక్తి, ప్రాణశక్తి, మంత్రమాల పారాయణాలు, శ్రీరేణుకకవచ, శ్రీరేణుకహృదయ, శ్రీరేణుకఖడ్గమాల, మంత్రమాల పారాయణాలు, శ్రీరుద్ర హవానము, స్థాపిత దేవతార్చన, శ్రీదేవి సప్తష్ట మంత్రమాల పారాయణం, శ్రీపరుశురామ, కార్తవీర్యార్జున, నీలంకంఠస్థ మంత్రమాల పారాయణం, శ్రీదేవి షాడామ్నాయ మహాపూజ, అష్టభైరవ బలి తదితర కార్యక్రమాలు చండి ఉపాసకులు పాలెం మనోహర్‌శర్మ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండితులు పాలెం చిన్నశర్మ, పాసికంటి ధనుంజయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మలక్ పేటలో కెటిఆర్‌కు ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు



మలక్ పేట నల్గొండ చౌరస్తాలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు స్వాగతం పలుకుతున్న అజాం ఆలీ, బిఆర్ఎస్ నాయకులు

**మలక్ పేట, జూలై 18,ప్రభాతవార్త:**
సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ్ సదస్సుకు తరలి వెళ్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మలక్ పేట్ నల్గొండ చౌరస్తా వద్ద మలక్ పేట నియోజకవర్గంకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ మంత్రి మహమూద్ అలీ, బిఆర్ఎస్ సభ్యత నమోదు కార్యక్రమం ఇంచార్జ్ అజాం ఆలీ, కార్యక్రమం ఇన్చార్జి పగిళ్ల నర్సింగ్, మలక్ పేట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ అజీత్ రెడ్డి, బాబు సుదర్శన్ తదితరుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కెటిఆర్ కు పుష్పగుచ్చలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలత రెడ్డి, సామ స్వప్న సుందర్ రెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి, యాఖుత్పుర నియోజకవర్గం ఇన్చార్జి సామ సుందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు షహీన్ అఫ్రోజ్, అనిత నాయక్, రాధ, మాజీ డైరెక్టర్లు వంజరి ప్రవిన్ కుమార్, నులీ శ్రీధర్ రావు, సల్మాన్, లలిత, యాదగిరి, డివిజన్ అధ్యక్షులు చల్లూరి రఘునందన్ రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, మంచికంటి జగన్, కామేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి : లక్ష్మారెడ్డి

**మలక్ పేట, జూలై 18, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ను తక్షణమే అమలు చేయాలని బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగెల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సైదాబాద్ మండల తహసిల్దార్ కు బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగెల లక్ష్మారెడ్డి, బిజెపి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, నాయకులు, కార్యకర్తలతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మడిగెల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్, రబీ పంటలు అన్నిటిని ఈ పథకం పరిధిలోకి తీసుకురావాలని, రైతులకు పథకం ప్రయోజనాలపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని జిల్లాలలో రైతుల నమోదు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అన్ని నోటిఫై చేసిన పంటలను పథకం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ప్రతి మండలంలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, రైతులు చెల్లించిన ప్రీమియం చివరి తేదీలు, క్లెయిమ్ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని పేర్కొన్నారు. పంట నష్టం జరిగిన సందర్భంలో వేగవంతమైన అంచనా, క్లెయిమ్ పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌలు రైతులకు కూడా



సైదాబాద్ మండల తహసిల్దార్ కు వినత్పత్రాన్ని సమర్పిస్తున్న బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగెల లక్ష్మారెడ్డి, బిజెపి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ తదితరులు

ఈ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టం అంచనా పారదర్శకంగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించాలని, భీమా క్లెయిమ్లను నిర్ణీత గడువులో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ప్రతివారం సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, ప్రతి రైతుకు ఈ పథకం ప్రయోజనం కోల్పోకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగం దీర్ఘకాలంగా పంట బీమా రక్షణ కోసం ఎదురుచూస్తోందని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్ చందర్ జీ, సహదేవ్ యాదవ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి : ఈటల

**ఎల్.బి.నగర్, జూన్ 18 ప్రభాతవార్త:**
నాగోల్ డివిజన్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే విధంగా చీరలు తీసుకుంటామని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ పార్క్ వద్ద కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజలతో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించగా ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి సమస్య గురించి కాలనీవాసులు ఎంపీకి వివరించారు. 20 కాలనీలకు చెందిన వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సుమారు 2లక్షల లీటర్ల సామర్థ్యం గల ఆధునిక ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్‌ను నిర్మించాలని ఎంపీని కోరారు. అందుకు స్పందించిన ఎంపీ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందర్

ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వచ్చే వేసవి కాలానికి ముందే అవసరమైన చర్యలు చేపట్టేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ బిజెపి ఇన్చార్జి సామ రంగారెడ్డి, కాలనీల ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

## భర్తను మర్డర్ చేసిన భార్యకు రిమాండ్ ..వనస్థలిపురం ఆర్టీసీ కాలనీలో ఘటన

**వనస్థలిపురం జులై 17,ప్రభాతవార్త :**
మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్తను భార్య హతమార్చిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హతురాలిని శుక్రవారం వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం చింతల కుంట ఆర్టీసీ కాలనీ కి చెందిన డేవిడ్ లూథర్ కార్నేలియస్,(,33)కడియం సుసన్ ఐశ్వర్య, ఉప్పల్ జెన్ ప్యాక్ సంస్థ లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. డేవిడ్ లూథర్ . స్వస్థలం ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం దాబా గార్డెన్స్, డేవిడ్ లూథర్ ఐశ్వర్యాలు సుమారు మూడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ప్రస్తుతం సుమారు రెండేళ్ల వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు.ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు . మృతుడు డేవిడ్ లూథర్ కొన్ని నెలల క్రితం ఉద్యోగం మానేసి నిరుద్యోగిగా ఇంట్లోనే ఉంటున్నాడు. నిరుద్యోగం మరియు తరచూ మద్యం సేవించడం వల్ల భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 15తేదీ గురువారం అర్ధరాత్రి సమయంలో డేవిడ్ లూథర్ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు, సుహాన్ ఐశ్వర్య ఇంటి నుంచే విధులు నిర్వహిస్తుండగా అతను. ఆమె పనిచేస్తున్న ల్యాప్‌టాప్‌ను మూసివేసి, ఆమెతో గొడవ ప్రారంభించాడు.ఆ సమయంలో నిందితురాలు వంటగదికి వెళ్లి కూరగాయలు కోసే కత్తి తీసుకుని అతనిపై దాడి చేసింది. మృతుడు ఆమె చేతిని పట్టుకోగా, తనను విడిపించుకోవడానికి అతని చేతిని రెండుసార్లు కొరికింది.

అనంతరం అతని ఛాతీ ఎడమ వైపున కత్తితో పొడిచింది.అతను స్పందించకుండా రక్తస్రావంతో పడిపోయిన తర్వాత చనిపోయాడని భావించిన నిందితురాలు, కత్తిని కడిగి వంటగదిలోని వాషింగ్ ప్రాంతం పక్కన ఉంచింది. మృదే హాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెలుగు లోకి వచ్చింది.హత్యకు ఉపయోగించినకత్తి. పోలీసులు స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండ్ తరలించారు.

## పెద్దఅంబర్ పేట కేంద్రంగా నకిలీ ఎరువుల తయారీ - రైతుల ఫిర్యాదుతో రూ.15 లక్షల విలువైన వెయ్యి ఎరువుల బస్తాలు స్వాధీనం



**హయత్ నగర్, జులై 18 ప్రభాతవార్త :**
పెద్ద అంబర్ పేటలో నకిలీ గ్రోమోర్ తయారీ యూనిట్ కలకలం లేపింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి, మేళ్ల చెరువు ప్రాంతాలలో నకిలీ ఎరువులు రైతులకు విక్రయించడంతో అనుమానం వచ్చిన రైతులు స్థానిక అగ్రి కల్చర్ అధికారులు, పోలీసుల కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు రాత్రి వేళలో ఎరువులతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ ను పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్ ని విచారించగా ఎరువులను పెద్ద అంబర్ పేట నుండి తెచ్చినట్లు చెప్పి తయా రీ కేంద్రాన్ని చూపించాడు. అక్కడ కు వెళ్లిన పోలీసులకు పెద్ద ఎత్తున ఎరువుల బస్తాలు కన్పించాయి. ఉప్పు, పౌడర్ రంగులతో నకిలీ ఎరువును తయారు చేసి గ్రోమోర్ పేరుతో ప్రింట్ చేసి రైతులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో 15 లక్షల విలువైన 1000 ఎరువుల బస్తాలను అధికారులు సీజ్ చేశారు. పరారీలో ఉన్న నకిలీ ఎరువుల తయారీ కేంద్రం నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున నకిలీ ఎరువుల తయారీ జరుగుతున్నా సంబంధిత విభాగాల అధికారులు ఎం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## మలక్ పేట పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన



మలక్ పేట పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్ పేట, జూలై 18,ప్రభాతవార్త:** మలక్ పేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ఓ దొంగతనం కేసులో ముసారాంబాగ్ కు చెందిన శ్రీకాంత చారిని మలక్ పేట పోలీస్ లు అరెస్ట్ చేశారు. విచారణ పేరుతో శ్రీకాంత చారిని కొట్టారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, పలువురు స్వర్ణకారులతో కలిసి మలక్ పేట పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. 20 24 జూలైలో మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి తస్కరించిన ఆభరణాలను శ్రీకాంతచారికి విక్రయించారని సమాచారం అందడంతో, అందులో భాగంగా మలక్ పేట పోలీసులు విచారణ నిమిత్తం శ్రీకాంతాచారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులకు విశ్వబ్రాహ్మణ స్వర్ణకార నేతలు, బీసీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కేసులోని విషయాలను, వాస్తవాలను వారికి వివరించి శ్రీకాంత చారిని పోలీసులు విడిచిపెట్టారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రామంతాపూర్‌లో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న యాదవ సంఘం అధ్యక్షుడు పింజెర్ల రఘు యాదవ్ తదితరులు

**రామంతాపూర్, జూలై 18 ప్రభాతవార్త :** రామంతాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యాదవ సంఘం గౌరవ అధ్యక్షులు సర్వ బాబు యాదవ్, అధ్యక్షులు పింజెర్ల రఘు యాదవ్, ప్రధాన కార్యదర్శి చెట్టబోయిన అశోక్ యాదవ్, ఉపాధ్యక్షులు సర్వ సత్తయ్య యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురికి ఉచితంగా కొలెస్ట్రాల్ పరీక్షలు, బిపి, షుగర్ టెస్ట్, డెంటల్ ,కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యాదవ సంఘం ఆధ్వర్యంలో పేదల కోసం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పలువురికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ యాదవ సంఘం నేతలు మావిళ్ళ రాములు యాదవ్, గడ్డం సత్యనారాయణ యాదవ్, కోశాధికారి రాము యాదవ్, ఆర్గనైజర్ సెక్రెటరీ ఆనంద్ యాదవ్, బత్తుల వినోద్ యాదవ్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

## బీరప్పగడ్డలో సర్‌పై ప్రజలకు అవగాహన



బీరప్పగడ్డలో ఓటర్లకు సర్ పత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగంరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :**
బీరప్పగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సర్ ప్రక్రియపై ఇంటింటికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగంరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సర్ ఫారం తీసుకుని అందజేసినట్లు తెలిపారు. ఫారం తీసుకున్న వారికి నింపి అధికారులకు అందజేస్తున్నామని తెలిపారు. ఫారం తీసుకోని వారు ఉంటే ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు జగదీష్ ముదిరాజ్, పాండు, గోపి, గిరి, సహీమ్, సంతోష్, శరత్, వంశీ, బన్నీ, కాశీ, ప్రకాష్ నాయక్, తేజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



యువ సంగ్రామ సదస్సులో పార్టీ నేతలతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి భారీ ఎత్తున పార్టీ నేతలు, యువకులు యువ సంగ్రామ సదస్సుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వంచనను బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు ఎండగట్టిందన్నారు. యూత్ డిక్లరేషన్ పేరుతో రాష్ట్ర యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మకద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. యువత సమస్యలు, నిరుద్యోగుల ఆవేదనలు, ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నాయకత్వం గళం విప్పగా, పెద్ద సంఖ్యలో యువత, పార్టీ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు., ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన హామీలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత పసుల ప్రభాకర్‌రెడ్డి,పలువురు మాజీ కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలి : పరమేశ్వర్‌రెడ్డి



సర్ సహాయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ భరత్‌నగర్ విజేత స్కూల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని కోరారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అఫ్జల్, అలుగుల అనిల్, బుత్కూరి మదన్ గౌడ్, నవీన్, రామ్ రెడ్డి, గంటా రవీందర్ రెడ్డి, కోమటి రెడ్డి కృష్ణారెడ్డి, ఇర్షాద్, నయీం, అఫ్రోజ్, ఆసిఫ్, వాహేద్, ,బంటి, ఈశ్వర్, విజయ్, మోసిన్, శ్రీనివాస్ ,మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్ఐఆర్ కేంద్రాలు పని చేస్తాయి : డిసి సమ్మయ్య



డిసి సమ్మయ్య

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కేంద్రాలు ఆదివారం కూడా పని చేస్తాయని డిప్యూటీ కమీషనర్, ఎఇఆర్ఓ వి.సమ్మయ్య తెలిపారు. ఆదివారం సెలవు దినమైనా ఓటర్ల సౌలభ్యం కోసం కేంద్రాలు రోజూ మాదిరిగానే పని చేస్తాయని ఆయన వెల్లడించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే క్రమంలో ఆదివారం కూడా తెరిచి ఉంచే కేంద్రాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కేంద్రాల్లో బిఎల్ఓలు,బిఎల్ఓ సూపర్వైజర్లు, వాలంటీర్లు అందుబాటులో ఉండి ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో సహకరిస్తారనీ అదేవిధంగా సూచనలు ఇస్తారని ఆయన తెలిపారు. వారంలో పని దినాల్లో కేంద్రాలకు రాలేని వారు ఆదివారం పని చేసే కేంద్రాలను వినియోగించుకోవాలని సమ్మయ్య కోరారు.

## లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా మాంట్ ఫోర్ట్ లిట్ ఫెస్ట్



మాంట్ ఫోర్ట్ లిట్ ఫెస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త కె.రాంమోహన్, రెవ బ్రదర్ ఆంథోని పోలిశెట్టి తదితరులు

**ఉప్పల్, జూలై 18 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శనివారం మాంట్ ఫోర్ట్ లిట్ ఫెస్ట్ 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రెవరెండ్ బ్రదర్ జోసఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్జీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్. కె. రామమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పుస్తక పఠనం మరియు సాహిత్య కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవడం వల్ల మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉస్మానియా మెడికల్ కాలేజ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. ప్రతాప్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.. అనంతరం ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభ్యాసంతో పాటు ఇటువంటి సాహిత్య ఉత్సవాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, విద్యార్థులు ఎప్పుడు నమ్మకాన్ని కోల్పోవద్దని, వారి ఆలోచనలను, కలలను ఉపాధ్యాయులతో మరియు తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేటర్ రెవరెండ్ బ్రదర్ ఎం.ఏ జార్జ్, ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ ఆంథోని, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత సమస్యలపై బిఆర్ఎస్ పోరాటం : ఎమ్మెల్యే మర్రి



**మల్కాజ్‌గిరి, జూలై 18,ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)పిలుపు మేరకు సరూర్‌నగర్‌లో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, నిరుద్యోగ యువతి, యువకులు, పార్టీ శ్రేణులు వందలాది కార్ల ర్యాలీతో భారీ ఎత్తున తరలివెళ్లి సభను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ యువత సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీల అమలు, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శ్రీమతి శాంతి శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, అమీనుద్దీన్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాసులు, అరుణ్ రావు, సురేష్, అరవింద్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, బాలకృష్ణ, ఫరీద్, వంశీ ముదిరాజ్, హేమంత్ పటేల్, శివ సాయి గౌడ్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, చంద్రమౌళి, విజయ్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, నిర్ణీత్ రెడ్డి, చిందం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి తదితరులతో పాటు అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతి, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు ఓటు నమోదు చేసుకోవాలి



పత్రాలను అందజేస్తున్న కేఎల్ఆర్, దేవ భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 18 ప్రభాతవార్త:**
అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటును సర్ ద్వారా నమోదు చేయించుకుని అమూల్యమైన ఓటును కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, టీపీసీసీ సభ్యుడు దేవ భాస్కర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఆర్కేపురం డివిజన్లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌లో వారు పాల్గొని ఓటర్లకు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న సర్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్లు, బి.ఎల్.ఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా, సహాయపడే విధంగా ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ప్రారంభించాలని సూచించారు. బిఎల్ఎలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్‌నేత, ఎస్కె.మహమ్మద్, బొడ్డుపల్లి మహేందర్, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, యాదవ రెడ్డి, పగడాల ఎల్లయ్య, సుదర్శన్, రాజు, సైదులు పాల్గొన్నారు.

## బిజెపి సీనియర్ నేత దిండు వెంకటేశ్‌గౌడ్ మృతి



దిండు వెంకటేశ్‌గౌడ్

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నాయకుడు దిండు వెంకటేశ్‌గౌడ్ మృతి చెందారు. గత కొంత కాలంగా ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జాము కంటే ముందు తుది శ్వాస విడిచారు. బిజెపిలో సీనియర్ నాయకుడైన వెంకటేశ్‌గౌడ్ పూర్వ సరూర్‌నగర్ మండల పార్టీ అధ్యక్షునిగా అదే విధంగా జిల్లా కమిటీలో పని చేశారు. ఆయన మృతితో నాదర్‌గుల్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. వెంకటేశ్‌గౌడ్ భౌతికకాయాన్ని మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిలతో పాటు పలువురు సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్‌గౌడ్ అంతిమ యాత్ర నాదర్‌గుల్‌లో జరిగిన తర్వాత స్థానిక స్మశానవాటికలో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు.

## బాబా పీఠాన్ని సందర్శించిన మహిళా ఎస్ఐ



పీఠాన్ని సందర్శించి పూజలు చేసిన మహిళా ఎస్ఐ ఉమా మహేశ్వరిని సన్మానించిన పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు నూతన మహిళా ఎస్ఐగా వచ్చిన ఉమా మహేశ్వరి శనివారం ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ఆమెకు బాబా శేష వస్త్రంతో సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఎస్ఐకు ఆధ్యాత్మిక గ్రంథాలను అందజేశారు.

## లార్డ్స్ పాఠశాలలో ఆషాఢ గోరింటాకు ఉత్సవం



బాలికలకు గోరింటాకు పెడుతున్న లార్డ్స్ ఉపాధ్యాయురాలు

**సరూర్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడలోనున్న లార్డ్స్ హై స్కూల్‌లో శనివారం ఆషాఢ గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో లార్డ్స్ గ్రూపు పాఠశాలల ఛైర్మన్ సిద్దాల బీరప్ప సూచనల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఈ వేడుకను జరిపారు. ఈ సందర్భంగా సాంప్రదాయ వస్త్ర ధారణతో వచ్చిన బాలికలకు మెహందీ వేశారు. అదే విధంగా విద్యార్థులకు ఆషాఢ గోరింటాకు ఉత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.